

నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

మంగళవారం

15 జులై 2025 పేజీలు : 08





## యువకుడు దారుణ హత్య

- ఆలస్యంగా వెలుగులోకి..
- చాకచక్యంగా ఛేదించిన పోలీసులు

మద్యం మత్తులో యువకుడిని దారుణంగా హతమార్చిన సంఘటన నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం విరువూరులో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్నేహితులే హంతకులుగా ఉన్న ఈ కేసుని నెల్లూరు రూరల్ పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. నెల్లూరు రూరల్ డిఎస్పి ఘట్టమనేని శ్రీనివాసరావు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.

### ఇది గాయత్రి మార్టా.. బ్రాందీషాపా..

## బార్ అండ్ రెస్టారెంటా..!




### ప్రజలకు అర్థంకాని మిలియన్ డాలర్ల ప్రశ్న




**కావలి, మేజర్‌న్యూస్ :**

కావలి పట్టణంలో స్థానిక బిజిలి బజారుకి, గుడికి అత్యంత సమీపంలో గాయత్రి మార్ట్ బ్రాందీ షాప్ బార్ అనబడే ఈ మద్యం దుకాణం కావలి నడిబొడ్డు సెంటర్లో నిర్వహిస్తున్నారు. నిత్యం ట్రంక్ రోడ్లో ఉదయం నుండి రాత్రి వరకు మహిళలు, అధికారులు, ఉద్యోగస్తులు నిరంతరం ఇదే మార్గంలో రోజు ప్రజలు వేలల్లో ప్రయాణిస్తుంటారు. కావలి పట్టణానికి నడి సెంటర్ అయిన బీపీయస్ సెంటర్లో అది మార్టా.. మద్యం షాపా.. బార్ షాపా.. అనేది ప్రజలకే అర్థం కాకుండా నిత్యం మద్యం సేవించి ప్రజలు వీరంగం సృష్టిస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు. ఎవరైనా గ్రామీణ ప్రాంతాల వారు ఒక నాలుగు క్వార్టర్ బాటిల్లు ద్విచక్ర వాహనం మీద పెట్టుకుపోతుంటే అది ఎవరైనా గమనించి ఎక్సైజ్ అధికారులకు సమాచారం ఇస్తే వారిని పట్టుకుని మాత్రం తీసుకొచ్చి కేసులు అయితే నమోదు చేస్తారు. నిత్యం రద్దీ ఉండే ప్రాంతాల్లో ఇటు వంటి బార్ అండ్ రెస్టారెంట్‌లాగా తలపిస్తున్న ఈ షాపుకు -మిగతా 2లో

### అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో

## నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు




- జిల్లా కలెక్టర్ ఆనంద్

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ఆనంద్ ఆయా శాఖల అధికారులను హెచ్చరించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్లో పిజిఆర్ఎస్ అర్జీలు, ఇళ్ల నిర్మాణాల పురోగతి, ఉపాధిహామీ పనులు,పి4, పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు మొదలైన అంశాలపై సబ్ కలెక్టరు, ఆర్డీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసిల్దార్లు, ఆయా శాఖల అధికారులతో -మిగతా 3లో

## రెవెన్యూ సమస్యలను తక్షణమే పరిష్కరించండి

### ఎమ్మెల్యే కాకర్ల



**వింజమూరు, మేజర్‌న్యూస్ :**

వింజమూరు మండలంలో నెలకొన్న రెవెన్యూ సమస్యలను వెంటనే పరిష్కరించి ప్రజలను కార్యాలయం చుట్టూ పదేపదే తిప్పుకుంటూ ఇబ్బందులకు గురి చేయవద్దని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ తహసిల్దారు ఎస్ఎం హమీద్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఎమ్మెల్యే సురేష్ ఆకస్మికంగా తహసిల్దార్ కార్యాలయానికి వెళ్లారు. కార్యాలయంలోని వివిధ విభాగాలకు చెందిన గదులను పరిశీలించారు. అనంతరం తహసిల్దార్ చాంబర్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ అధికారులు కుల ధ్రువీకరణ ఆదాయ ధ్రువీకరణ నివాస స్థల ధ్రువీకరణ కుటుంబ సభ్యుల ధ్రువీకరణ పత్రాలను కూడా సకాలంలో ఇవ్వకుండా కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని అనేక మంది తమ వద్ద వాపోతున్నారని తెలిపారు. ప్రజలను ఎంతగా హింసించడం తగదన్నారు. ప్రజా సమస్యలపై ఫిర్యాదు అందగానే వాటిని పరిశీలించి పరిష్కార మార్గాలు చూపాలే తప్ప కార్యాలయం చుట్టూ తిప్పుకోవడం సబబు కాదన్నారు. అంతేకాకుండా సిబ్బంది ఉండే గదులు కూడా మిగతా 3

### విచారణ జరిపి చట్టపరంగా

## న్యాయం చేస్తాం



**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :**

నగరంలోని జిల్లా పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిఆర్ జిఎస్) కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ సోమవారం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదు దారులతో ఎస్పీ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో 118 ఫిర్యాదులు స్వీకరించినట్లు ఆయన తెలియజేశారు. -మిగతా 2లో

# ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 57 అర్జీలు



**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశాల మేరకు నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో అందుకున్న ప్రజా సమస్యలకు నిర్దేశించిన సమయంలోపు పరిష్కారాలను అందించాలని డిప్యూటీ కమిషనర్ చెన్నుడు అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో సోమవారం నిర్వహించారు. నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు కార్యక్రమంలో పాల్గొని అర్జీదారుల నుంచి వినతి పత్రాలను స్వీకరించారు. విభాగాల వారీగా ఆప్కాస్ 4, ఇంజనీరింగ్ 10, టిడ్కో హౌసింగ్ 21, రెవెన్యూ 2, టౌన్ ప్లానింగ్ 10, పబ్లిక్ హెల్త్ 8, జి.ఎస్.డబ్లు.ఎస్ 2, మొత్తం 57 అర్జీలను డిప్యూటీ కమిషనర్ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందుకున్నారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ చైతన్య, ఇంజనీరింగ్ విభాగం ఎస్ఇ రామ్ మోహన్ రావు, ఈ.ఈ రహంతు జానీ, టౌన్ ప్లానింగ్ ఏ.సి.పి రఘునాథ్, మేనేజర్ రాజేశ్వరి, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మద్యం మత్తులో యువకుడు దారుణ హత్య



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** మద్యం మత్తులో యువకుడిని దారుణంగా హతమార్చిన సంఘటన నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం విరువూరులో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్నేహితులే హంతకులుగా ఉన్న ఈ కేసుని నెల్లూరు రూరల్ పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. నెల్లూరు రూరల్ డిఎస్పి ఘట్టమనేని శ్రీనివాస రావు కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూరు రూరల్ మండలం యనమలవారిదిన్నే గ్రామానికి చెందిన కాయల మోహన్ చంద్ (22) అనే యువకుడు కనిపించడం లేదని పోలీసులకు ఫిర్యాదు అందిందన్నారు. పోలీస్ విచారణలో భాగంగా పొదలకూరు మండలం విరువూరు గ్రామానికి చెందిన తుమ్మల తరుణ్ కుమార్ రెడ్డికి మోహన్ చంద్‌తో పాత స్నేహం ఉందన్నారు. గతంలో వారి ఇరువురి మధ్య ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో మనస్పర్ధలు ఉన్నాయని తెలిపారు. తరుణ్ కుమార్ రెడ్డి తన స్నేహితులు పునీత్ రెడ్డి, శ్రీధర్, మరో ఇద్దరితో కలిసి 10వ తేదీ రాత్రి పెన్నా నదిలో సిట్టింగ్ (మద్యం తాగడానికి) ఏర్పాటు చేశాడు. ఒక పథకం ప్రకారం మోహన్ చంద్‌ను తన స్నేహితుల ద్వారా నమ్మకంగా పిలిపించి హత్య చేసినట్లు వివరించారు. అనంతరం మృతదేహాన్ని అక్కడే పెన్నా నదిలో పూడ్చి ఎవరి దారిన వారు వెళ్లిపోయారని తెలిపారు. బాడుగ కార్లు అమ్మే విషయమై గొడవ ఏర్పడిందని, దీనికి తోడు గతంలో ఇద్దరి మధ్య ఉన్న ఆర్ధిక లావాదేవీల నేపథ్యంలో ముందుగా రచించుకున్న వ్యూహంలో భాగంగా మోహన్ చంద్‌కు మద్యం తాపించి మత్తులో కత్తితో పొడిచి, జాకీరాడ్డుతో తలపై మోది హతమార్చినట్లు చెప్పారు. ఈ క్రమంలో సోమవారం పొదలకూరు తహసిల్దార్ శివ కృష్ణయ్య ఆధ్వర్యంలో శవాన్ని వెలికితీసి ఫోరెన్సిక్ వైద్యుల చే మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి మృత దేహాన్ని కుటుంబ సభ్యులకు అందజేశామన్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని కేసు విచారణ చేస్తున్నట్లు డిఎస్పీ పేర్కొన్నారు. డిఎస్పీతో పాటు నెల్లూరు రూరల్ సీఐ గుంజి వేణు, పొదలకూరు సీఐ శివరామకృష్ణారెడ్డి, నెల్లూరు రూరల్ ఎస్ఐలు సంతోష్, లక్ష్మణరావు, పొదలకూరు, మనుబోలు ఎస్ఐలు షేక్ మహ్మద్ హనీఫ్, రాకేష్, పోలీసు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇది గాయత్రి లిక్కర్ మార్టా.. బ్రాందీషాపా.. బార్ అండ్ రెస్టారెంటా !

*(మొదటి పేజీ తరువాయి)*

మాత్రం ఎక్సైజ్ అధికారులు ఎందుకు పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారో అర్థం కావడం లేదని ప్రజలు, ప్రజా సంఘాలు, మహిళలు తమ మనసులో ఉన్న ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎక్కడ బెల్టుషాపులు నిర్వహించకూడదు.. నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దేవుని మందిరానికి, పాఠశాలలకు వంద అడుగుల దూరంలో మద్యం దుకాణాలు ఉండాలని ప్రభుత్వం జీవో ప్రకటించినప్పటికీ, ప్రభుత్వ ఆదేశాలు తుంగలో తొక్కి ఇష్టానుసారంగా ఈ మార్ట్ ద్వారా రెస్టారెంట్ నిర్వహిస్తున్నారు. ఎక్సైజ్ అధికారులు మాత్రం ఎందుకనో మౌనంగా ఉంటూ, గ్రామీణ ప్రాంతాల్లో కొంతమందిని ఎన్నుకొని ఏదో ప్రభుత్వానికి నామమాత్రమే కేసులు చూపించాలి కాబట్టి ఐదో.. పదో.. మద్యం సీసాలు పట్టుకున్నట్లు తీసుకువచ్చి పాత్రికేయుల ముందు ప్రవేశపెట్టి సమాచారం గ్రూపుల్లో పెడుతున్నారు. అంతేకానీ నిజంగా కావలి నియోజకవర్గంలో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా నిర్వహిస్తూ, ప్రతి




గ్రామంలో ఎక్కడ చూసిన మద్యం బెల్టుషాపులే.. వాటికి మాత్రం నియంత్రణ లేదు. ఎందుకంటే ప్రతి నెల మామూళ్ల తీసుకొని ఏవిధంగా అధికారులు విధులు నిర్వహిస్తున్నారో ప్రజలకు, ఉన్నతాధికారులకు అందరికీ బహిరంగంగా తెలిసిన విషయమే. అయితే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు సంవత్సరం రోజులు దాటిపోయినప్పటికీ పత్రికల్లో, సోషల్ మీడియాలో మద్యం ఏరులై పారుతుందని ప్రచురించినప్పటికీ, విచ్చలవిడిగా మద్యం సేవిస్తూ ఓపెన్ బ్రాందీషాపులు, నైట్‌సేల్స్ నిర్వహిస్తున్నప్పటికీ వాళ్ళని మాత్రం చూసి చూడనట్టుగా వెళ్తున్నారు. మరి ఈ విషయంపై జిల్లా ఉన్నత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవట్లేదు, మరి వారి యొక్క ఉద్దేశం ఏమిటనేది ప్రజలకు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మిగిలిపోయింది. అంతేకాకుండా వీరి వెనుక రాజకీయ పలుకుబడి ఏమైనా ఉందా.. లేకపోతే అధికారులు మామూలు మత్తులో మునిగిపోయారా ? అనేది అర్థంకాని ప్రశ్నగా ప్రజలకు మిగిలిపోయింది. కావలి పట్టణంలో నడిబొడ్డున రాత్రి పూట ఏవిధంగా సంతను తలపిస్తున్నట్లు ఉంది. ఒకే బ్రాందీషాప్, మార్ట్ ఒకసారి గాయత్రి మార్ట్ ఒకసారి, బార్‌షాప్ ఒకసారి, ఇన్ని పేర్లు పెట్టి మారుస్తున్నప్పటికీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఒక్కసారి విజిలెన్స్ అధికారులు ఈ షాప్, సంబంధిత అధికారుల మీద దృష్టి సాధించాలని ప్రజలు, ప్రజా సంఘాలు మహిళలు, ప్రతిపక్షాలు, కోరుకుంటున్నాయి.

# విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం



*(మొదటి పేజీ తరువాయి)*

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి చట్ట ప్రకారం విచారణ జరిపి పరిష్కరించాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఈ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమ లో అడిషనల్ యస్.పి.(అడ్మిన్) సిహెచ్.సౌజన్య, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులు రెడ్డి, ఉమెన్ పిఎస్ డిఎస్పి రామారావు, ఎస్బి-2 సీఐ శ్రీనివాసరెడ్డి, వెల్ఫేర్ ఆర్ఐ రాజారావు మరియు కంప్లైంట్ సెల్ సిబ్బంది పాల్గొన్నారు.

**వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని..**

- నెల్లూరు టౌన్ పొదలకూరు రోడ్ లో బాల రవితేజ అనే వ్యక్తి ఒక ఆఫీస్ పెట్టి ఫిలిప్పిన్స్ లో డాక్టర్ సీట్లు ఇప్పిస్తానని చెప్పినట్లు, దర్గామిట్ట పరిధికి చెందిన వ్యక్తి యొక్క కుమార్తెకు సీటు ఇప్పిస్తానని నమ్మించి 17 లక్షల తీసుకుని స్టూడెంట్ వీసా ఇప్పించకుండా, విజిటింగ్ వీసా ఇప్పించి మోసం చేశాడని, నగదు అడుగుతుంటే అసలు స్పందించడం లేదని, విచారించి న్యాయం చేయాలని విన్నవించారు.
- సంతపేట పరిధికి చెందిన వ్యక్తి యొక్క కుమార్తెకు విదేశాలలో సూపర్ వైజర్ ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి, మున్వర్ మరియు అతని అల్లుడు ఇంతియాజ్ కుమార్తె సబీనా కలిసి నెల్లూరు టౌన్ లో ఒక ఆఫీసు పెట్టుకొని విదేశాలకు పంపుతున్నట్లు, లజ్జంబర్ అనే దేశానికి పంపిస్తానని నమ్మించి 6 లక్షల రూపాయల నగదు తీసుకొని, 17 నెలల నుండి విదేశాలకు పంపకుండా నగదు తిరిగి ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని విచారించి న్యాయం చేయాలని కోరారు.
- నెల్లూరు రూరల్ పరిధికి చెందినటువంటి మహిళను, నెల్లూరు టౌన్ కు చెందిన సంపత్ అనే వ్యక్తి తో పెళ్లి నిశ్చయం చేసుకున్నట్లు, అతని ప్రవర్తన సరిగా లేక రద్దు చేసుకున్నట్లు, తరువాత తన వ్యక్తిగత ఫోటోలు వీడియోలు మెసేజ్లు లను బంధువులకు చూపిస్తున్నట్లు, తనకి వస్తున్న పెళ్లి సంబంధాల వారికి అవి చూపించి క్యాన్సల్ చేయిస్తున్నాడని, విచారించి న్యాయం చేయాలని కోరారు.
- పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన వ్యక్తి వద్ద, కావలి టౌన్ పరిధికి చెందినటువంటి దేవరకొండ సుధీర్ అనే వ్యక్తి లక్షకు మూడు లక్షలు పాత నోట్లు ఇస్తానని నమ్మించి 50 లక్షలు నగదు తీసుకొని, పాత నోట్లు ఇవ్వకుండా, తన నగదు తిరిగి ఇవ్వకుండా ఇబ్బందులు గురి చేస్తున్నాడని, మోసపోయామని విచారించి న్యాయం చేయాలని కోరారు.
- నవాబ్ పేట పరిధికి చెందినటువంటి మహిళ, తన కుమార్తె ఆరు నెలల క్రితం నెల్లూరు రూరల్ పరిధికి చెందిన నాగూర్ బాబుతో ప్రేమ వివాహం చేసుకున్నట్లు, అప్పటి నుండి కట్నం కోసం, కులం తక్కువ అని కుమార్తెను భర్త, అత్తమామలు వేధించేవారని, 15/04/25 న తన కుమార్తె చనిపోయిందని తెలిపారని, స్టేషన్ లో కేసు నమోదు చేసినట్లు, తన కుమార్తె మరణంపై అనుమానం ఉందని, పూర్తిగా విచారించి న్యాయం చేయాలని కోరారు.
- బుచ్చి పరిధికి చెందినటువంటి మహిళను, అత్తమామలు భర్త అధిక కట్నం కోసం వేధిస్తున్నారని, ఇంటి నుండి గెంటి వేశారని కౌన్సిలింగ్ నిర్వహించి కుటుంబాన్ని చక్కదిద్దాలని కోరారు.
- ఆత్మకూరు పరిధికి చెందినటువంటి వృద్దుని, తన కుమారుడు నరసింహ, తన పేరు మీద ఉన్న ఆస్తినంతా రాయించుకొని, ఇప్పుడు తన బాగోగులు చూసుకోవడం లేదని, అసలు పట్టించుకోవడంలేదని విచారించి న్యాయం చేయాలని కోరారు.
- విడవలూరు పరిధికి చెందిన మహిళ, నెల్లూరులో ఓ షాపులో పనిచేస్తుండగా ముదువర్తి గ్రామానికి చెందిన వ్యక్తి ఇన్స్టాగ్రామ్ లో పరిచయమై, పలుమార్లు నగదు బంగారు తీసుకున్నాడని, ఇంకా ఇవ్వాలని, లేదంటే ఇన్స్టాల్ తన యొక్క వ్యక్తిగత ఫోటోలు బయట పెడతానని బెదిరిస్తున్నాడని, విచారించి న్యాయం చేయాలని కోరారు.

# కనిపించని బార్కెట్లు - నేషనల్ హైవేపై తరచూ ప్రమాదాలు

**జలదంకి, మేజర్‌న్యూస్ :** కావలి నుండి ఉదయగిరి వైపు వెళ్లే 167 నేషనల్ హైవే పై జమ్మలపాలెం వద్ద గతంలో బారికెట్లు ఏర్పాటు చేసిన ప్రస్తుతం అవి కనిపించడం లేదు గతంలో రోడ్డు ప్రమాదాల నివారించడానికి జలదంకి పోలీసులు జమ్మలపాలెం బస్టాండ్ సమీపంలో రెండువైపులా బారికేట్లు ఏర్పాటు చేశారు. గత నెల రోజుల నుంచి కనిపించడం లేదు అవి పడి పోయిన వాటిని పట్టించుకునే నాధుడే కనిపించడం లేదు. దీంతో తరచూ ఇక్కడ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. భారీకేట్లు లేకపోవడంతో వాహనదారులు అతివేగంగా వస్తూ పాదచార్లు పైకి కూడా వచ్చి ప్రమాదానికి కారణమవుతున్నారు. ఎంతోమంది ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పడంతో పాటు ఎదురెదురుగా మోటార్ సైకిల్ ఢీకొని ప్రమాదాలు జరుగుతూ గాయాల పాలవుతున్నారు. అలాగే మద్యం తాగి కొంత మంది అతివేగంగా నడుపుతూ ప్రమాదానికి



కారణం అవుతున్నారు. జమ్మలపాలెం హైవేపై సాయంత్రం 6 దాటితే ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామ ప్రజలు బేంబేలు ఎత్తుతున్నారు. ఇప్పటికైనా జలదంకి పోలీసులు జమ్మలపాలెం వద్ద బారికేట్లను ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాల్సిన అవసరం ఉంది.

## రెవెన్యూ సమస్యలను తక్షణమే పరిష్కరించండి

*(మొదటి పేజీ తరువాయి)*

చెత్తా చెదారంతో నిండు ఉండడం, దుమ్ము, ధూళి బూజుతో ఉన్నాయన్నారు. దీంతో అధికారుల పనితీరు తెలియజేస్తుందన్నారు. మండలంలో సమస్యలు పరిష్కరించేందుకు తన వంతు సహాయ సహకారాలు కూడా అందిస్తానన్నారు. ఎమ్మెల్యే పలు ప్రశ్నలతో తహసిల్దార్‌ను ఒక్కరిబిక్కిరి చేస్తున్న నేపథ్యంలో తహసిల్దార్ గతంలో ఇక్కడ పనిచేసిన రెవెన్యూ అధికారులు చేసిన తప్పిదాలతో భయమేస్తుందన్నారు. అందుకు ఎమ్మెల్యే గతంలో అధికారులు చేసిన తప్పిదాలను సరి చేయవలసిన బాధ్యత ప్రస్తుత అధికారులకు లేదా అంటూ ప్రశ్నించారు. అధికారులు మానవతా దృక్పథంతో పేదవారికి సాయం చేయాలన్నారు. పేదవారిని కార్యాలయం చుట్టూ తిప్పుకోవడం పద్ధతి కాదన్నారు. మండలంలోని పలువురు నాయకులు రెవెన్యూ అధికారుల తీరుపై ఎమ్మెల్యే ఎదుటనే తహసిల్దార్‌ను నిలదీశారు దాంతో ఎమ్మెల్యే ఆగ్రహించి ప్రతి సమస్యను గడువులోపే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజాసేవలో అధికారులు మరింత బాధ్యతతో వ్యవహరించాలన్నారు. అనంతరం రెవెన్యూ సిబ్బందితో సమావేశమై ఇక నుండి అయినా విధి నిర్వహణ పట్ల అంకిత భావం కలిగే పని చేయాలన్నారు. పని చేయని అధికారులపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, అందులో భాగంగా నియోజకవర్గంలో పలు మండలాలలో రెవెన్యూ సమస్యలు అధికంగా ఉన్నట్లు తన దృష్టికి రావడంతో వాటిని పరిష్కరించడం కోసం ఆకస్మికంగా కార్యాలయాలను తనిఖీ చేయడం ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు సిబ్బందికి స్పష్టమైన



ఆదేశాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. అనేక మండలాలలో రెవెన్యూ రికార్డులను సక్రమంగా లేకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. సరి చేయాల్సిన అధికారులు నిమ్మకు నేర్పినట్లు వ్యవహరించడంతో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని అనేక మంది తన వద్దకు వచ్చి వారికి జరిగిన అన్యాయాన్ని తెలుపుతుంటే బాధ కలుగుతుందన్నారు. ఇకనైనా రెవెన్యూ అధికారులు తమ విధులను సక్రమంగా నెరవేర్చి ప్రజలకు అసౌకర్యం కలవకుండా చూడాలన్నారు లేనియెడల చర్యలకు గురవుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో సిడిపిఓ పద్మజ కుమారి, మండల పార్టీ కన్వీనర్ గూడా నర్సారెడ్డి, కోడూరు నాగిరెడ్డి చల్లా వెంకటేశ్వర్లు యాదవ్, చల్ల శ్రీనివాసులు యాదవ్, జూపల్లి రాజారావు, గువ్వల కృష్ణారెడ్డి, చేబ్రోలు వసంతరావు, గోసు మహేష్ యాదవ్, నూతలపాటి జయలక్ష్మి, షేక్ మహబూబ్ బాషా, ఆనంగి రమణయ్య, గురజాల వాసు నాయుడు, తిరుపతి ఆచారి, కేవస్ నాయుడు, డి శ్రీనివాసులు రెడ్డి, తెలుగుదేశం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

*(మొదటి పేజీ తరువాయి)*

కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమానికి సంబంధించి ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాలను చేరుకోవడంలో అశ్రద్ధగా ఉంటే కఠిన చర్యలకు వెనకాడే ప్రసక్తే లేదని హెచ్చరించారు. జిల్లాలో పీ4 కార్యక్రమం అమల్లో భాగంగా రాబోయే రెండు వారాల్లో కనీసం 50 వేల బంగారు కుటుంబాలను దత్తత చేసుకునే విధంగా మార్గదర్శిలను ప్రోత్సహించాలన్నారు. కేవలం ఆర్థిక అవసరాలకు చేయూతనందించడమే కాకుండా ఆయా బంగారు కుటుంబాలకు అవసరమైన వృత్తి నైపుణ్యాలను అందించడం, చదువులకు సహాయం చేయడం వంటి ఇతర అవసరాలను గుర్తించి చేపట్టే విధంగా సహకారం అందించాలన్నారు. మార్గదర్శులు బంగారు కుటుంబాల దత్తత స్వీకరణ కార్యక్రమం అంతా ఆన్‌లైన్‌లోనే జరుగుతుందని, ఈ విషయమై అధికారులు అందరూ ప్రత్యేక ప్రచార మోడ్‌లో నిర్వహించాలన్నారు. అదేవిధంగా జిల్లాలో గృహ నిర్మాణాలు, ఉపాధి హామీ పనుల




పురోగతి మెరుగుపడాల్సి ఉందన్నారు. అధికారులందరూ తమకు కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. గృహనిర్మాణాల్లో వివిధ దశలను పూర్తి చేసి ఇళ్లు పూర్తయ్యేలా ఎంపిడివోలు, హౌసింగ్, ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. ఇళ్ల నిర్మాణంలో పురోగతి సాధించేందుకు అవలంబించాల్సిన విధానాల గురించి ఇటీవలే ఎంపీడీవోలకు దిశానిర్దేశం చేశామని, అందుకనుగుణంగా పురోగతి సాధించాలన్నారు. అలాగే ఎపివోలు ఉపాధిహామీ పని దినాలను పెంచి కూలీలకు పనులు కల్పించాలన్నారు. హౌసింగ్‌లో ఉపాధిహామీని అనుసంధానిస్తూ 90 రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. జిల్లాలోని, విద్యాశాఖాధికారు లు ప్రత్యేక దృష్టి పెట్టి బడిఈడు పిల్లలందరూ బడిలో చేరేలా, ఒకటో తరగతిలో రిజిస్ట్రేషన్లు పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని సక్రమంగా అందించాలని, మంచినీటి వసతి సౌకర్యాలను మెరుగుపరచాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీల పరిష్కారం పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రజలకు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడమే ప్రధానలక్ష్యంగా యంత్రాంగం పనిచేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్సులో ఇంచార్జి డిఆర్‌ఓ హుస్సేన్ సాహెబ్, హౌసింగ్, డ్వామా పీడీలు వేణుగోపాల్, గంగాభవాని, విద్యుత్ ఎస్‌ఈ విజయన్, డీఈఓ బాలాజీరావు, డీపీఓ శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సాగరంలో సుపరిపాలన

**అనంతసాగరం, మేజర్‌న్యూస్ :** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, ఆత్మకూరు నియోజకవర్గం శాసనసభ్యులు, రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పిలుపు మేరకు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు మెటుకూరు కృష్ణారెడ్డి సూచనల మేరకు మండల కేంద్రమైన అనంతసాగరంలో సోమవారం 56 బూతులో బూతు లెవల్ ఏజెంట్ అనకర్ల కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు బొర్రా బాబు, మండల క్లస్టర్ ఇంచార్జ్ కత్తి పెంచలయ్య ఇంటింటికి వెళ్లి అడుగుపై ప్రచారం నిర్వహించారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు.

## పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఈఓ-2 కాటంరెడ్డి

**అనంతసాగరం, మేజర్‌న్యూస్:** మండలంలోని పాతాళపల్లి, ముస్తాపురం గ్రామాలలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను సోమవారం ఎంఈఓ 2 కాటంరెడ్డి ప్రభాకర్ రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు శాతం పెంచాలని ప్రధానోపాధ్యాయులకు ఆయన సూచించారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో మండల విద్యా వ్యవస్థపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రెండు మోటూరు బైక్‌లు ఢీ
### ఒకరి పరిస్థితి విషమం

**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని సూరాయి పాలెం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు తగిలాయి. సూరాయిపాలెం గ్రామానికి చెందిన అహ్మద్, చేజర్ల నడిగడ్డ అగ్రహారంకు



చెందిన వెంకటేశ్వర్లు బైకులు ఎదురెదురుగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్వర్లు సినిమా పక్కీలో ఒక్కసారిగా పైకి ఎగిరి రోడ్డు మీద పడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయాలు తగిలాయి. వెంటనే స్థానికులు క్షతగాత్రుడిని నెల్లూరులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. పొదలకూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

## క్షేత్రస్థాయిలో బూత్‌లెవల్ అధికారులు
## క్రియాశీలకంగా పని చేయండి




**నెల్లూరు కార్పోరేషన్, మేజర్ న్యూస్ :** ఎన్నికల నిర్వహణలో బూత్ లెవెల్ అధికారులు క్షేత్రస్థాయిలో క్రియాశీలకంగా పనిచేయాలని నెల్లూరు సిటీ నియోజకవర్గం (117) ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అదికారి వై.ఓ. నందన్ పేర్కొన్నారు. సోమవారం నెల్లూరు సిటీ నియోజకవర్గ పరిధిలోని బి.ఎల్.ఓ లకు నెల్లూరు కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణకు కమిషనర్ హాజరై బి.ఎల్.ఓ లతో మాట్లాడుతూ ఇసిఐ ఆదేశాల మేరకు నియోజకవర్గంలోని బి.ఎల్.ఓ లు అందరికి రెండవ రోజు శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు నెల్లూరు సిటీ నియోజకవర్గం పరిధిలోని 50 మంది బి.ఎల్.ఓ లకు శిక్షణ అందించామని తెలిపారు. శిక్షణలో అధికారులు తెలియజేసిన వాటిని శ్రద్ధగా విని, ఖచ్చితంగా ఆచరించాలని కమిషనర్ బి.ఎల్.ఓ లకు సూచించారు. బి.ఎల్.ఓ లకు ఎలాంటి సమస్యలున్నా, అనుమానాలున్నా తనతో పాటు, సంబంధిత అధికారులను నేరుగా సంప్రదించవచ్చని కమిషనర్ సూచించారు. సమావేశంలో ఏ.ఈ.ఆర్.ఓ షేక్ షఫీ మాలిక్, ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్ వి.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# జీతాలు పెంచాలని కార్పోరేషన్ వద్ద ధర్నా




**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట సోమవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికుల నిరసన ధర్నా నిర్వహించారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఇంజనీరింగ్ విభాగంలో పనిచేసే కార్మికులు రెండవ రోజు కూడా యధా ప్రకారం విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. నెల్లూరు నగరపాలక సంస్థలో పని చేసే మంచినీటి సరఫరా విభాగంలోని వాల్ ఆపరేటర్లు పంపింగ్ ఆపరేటర్లు వర్క్ ఇన్స్పెక్టర్లు, పార్కులో పని చేసే వారు, కంప్యూటర్ ఆపరేటర్లు విధులు బహిష్కరించి సమ్మెలో పాల్గొన్నారు. వారికి మద్దతుగా పారిశుధ్య కార్మికులు, డ్రైవర్లు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ తదితర విభాగాల కార్మికులు నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ వద్ద జరిగిన నిరసన ధర్నా కార్యక్రమంలో భారీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నగర గౌరవాధ్యక్షులు కత్తి శ్రీనివాసులు, సిఐటియు రూరల్ కార్యదర్శి కే.పెంచల నరసయ్యలు మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ లలో పని చేసే ఇంజనీరింగ్ విభాగం కార్మికులు చాలీచాలని వేతనాలతో అనేక రోజుల నుండి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ పని చేస్తున్నారని అన్నా రు. నైపుణ్యం కలిగిన కార్మికులు జీతాలు ఎక్కువ తీసుకోవాల్సింది పోయి అతి తక్కువ వేతనాలు పొందడం విడ్డూరంగా ఉందని అన్నారు. నిరంతరం ప్రమాదాల నడుమ పనిచేసే కార్మికులు ఇంజనీరింగ్ విభాగం కార్మికులని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేనిది తొలుతగా నెల్లూరు నగర పాలక సంస్థలో కార్మికులు చేసే పనిని కాంట్రాక్టర్లకు అప్పగించేందుకు తొమ్మిదో వార్డులో పారిశుద్ధ్య పనులకు టెండర్లు పిలిచారన్నారు. దీనివల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోతారన్నారు. తక్షణమే టెండర్ల ప్రక్రియ ఆపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నెల్లూరు నగరపాలక సంస్థలో పనిచేసే అన్ని విభాగాల కార్మికులు విధులు బహిష్కరించి మెరుపు సమ్మె చేపడుతామని తెలిపారు. ధర్నా అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఉన్న నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ చెన్నుడుకు వినతి పత్రం సమర్పించారు.

మంగళవారం సాయంత్రం లోపు సరియైన వివరణ అధికారుల నుండి రాకపోతే విధులు బహిష్కరిస్తామని వారికి తెలియజేశారు. స్పందించిన అధికారులు సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని సామరస్యంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని యూనియన్ నాయకులకు, కార్మికులకు తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు నెల్లూరు నగర కార్యదర్శి నాగేశ్వరరావు, సిఐటియు రూరల్ నాయకులు మాలకొండయ్య, కోటేశ్వరరావు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు అశోక్, మట్టిపాటి శ్రీనివాసులు, కొండమ్మ, కిరణ్, రాంబాబు, ముని మోహన్‌బాబు, బాలు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి స్వచ్ఛతను క్రమం తప్పకుండా పర్యవేక్షించండి : కమిషనర్ వైఓ నందన్

**నెల్లూరు కార్పోరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకుల ద్వారా సరఫరా అవుతున్న తాగునీటికి క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహించి, నాణ్యతను పర్యవేక్షించాలని కమిషనర్ వై.ఓ నందన్ అధికారులను ఆదేశించారు. పారిశుద్ధ్య నిర్వహణ పనుల పర్యవేక్షణలో భాగంగా స్థానిక సంతపేట బుజ్జమ్మ రేవులోని పంప్ హౌస్‌ను సోమవారం తనిఖీ చేశారు. నగరంలోని వివిధ డివిజన్లకు పంప్ హౌస్ ద్వారా సరఫరా అవుతున్న తాగునీటి వ్యవస్థను అడిగి తెలుసుకున్నారు. నిర్దేశించిన ప్రమాణాల మేరకు తాగునీటి స్వచ్ఛత ఉండేలా ప్రతిరోజు పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. తాగునీటి పైప్ లైన్ లకు డ్రైనేజీ లైను అనుసంధానం కాకుండా, తాగునీటి పైపులు కలుషితం కాకుండా నిరంతరం పర్యవేక్షిస్తూ చర్యలు తీసుకోవాలని సూచించారు. బుజ్జమ్మ రేవు ప్రాంతంలోని వివిధ ప్రాంతాలలో కమిషనర్ పర్యటించి స్థానిక ప్రజలతో మాట్లాడి తాగునీటి స్వచ్ఛత గురించి విచారించారు. అనంతరం పొర్లు కట్ట ప్రాంతంలోని బాణాసంచా తయారీ కేంద్రాన్ని కమిషనర్ తనిఖీ చేశారు. కేంద్రం నిర్వహించేందుకు అనుమతులు, తయారీ విధానంలో తీసుకుంటున్న జాగ్రత్తలు తదితరాంశాలను పరీక్షించారు. స్థానికంగా జరుగుతున్న పారిశుధ్య నిర్వహణ పనులను కమిషనర్ పర్యవేక్షించి, డ్రైను కాలువల పూడికతీత, సిల్టు ఎత్తివేత పనులను క్రమం తప్పకుండా డివిజన్ వ్యాప్తంగా నిర్వహించాలని సిబ్బందికి సూచించారు. నగరంలోని కొన్ని ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన వ్యర్థాలను పొర్లుకట్ట ప్రాంతంలో డంపు చేస్తున్నారంటూ జనసేన నాయకులు మల్లికార్జున, కిషోర్‌ల ఫిర్యాదు మేరకు ఆయా ప్రాంతాలను కమిషనర్ తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు నగర పాలక సంస్థ ఎస్ఈ రామ్ మోహన్ రావు, ఈఈ రహంతు జానీ, డీఈలు



రఘురామ్, ముజాహిద్దీన్, శానిటేషన్ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమ గ్రావెల్ రవాణాను అరికట్టండి : అధికారులకు బిజెపి విజ్ఞప్తి



**పొదలకూరు, మేజర్‌న్యూస్ :** పొదలకూరు మండలంలో గత కొంతకాలంగా అడ్డు అదుపు లేకుండా యదేచ్ఛగా సాగుతున్న గ్రావెల్ అక్రమ రవాణాను అరికట్టాలని పొదలకూరు మండల బిజెపి నాయకులు సోమవారం రెవెన్యూ, పోలీస్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల బిజెపి అధ్యక్షుడు పూల ప్రశాంత్ మాట్లాడుతూ గత వారం రోజుల నుంచి పొదలకూరు పట్టణంలోని సాయిబాబా గుడి సమీపంలో ఖాళీ ప్లాట్ లకు అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్నారని చెప్పారు. అలాగే అయ్యగారిపాలెం గ్రామం నుంచి రెండు జెసిబి లు, 15 ట్రాక్టర్లతో గత రాత్రి పొదలకూరులోని వైసీపీకి చెందిన ఓ బడా బాబుకు ఎలాంటి అనుమతులు లేకుండా గ్రావెల్ తరలించారని పేర్కొన్నారు. అక్రమ గ్రావెల్ రవాణాకు మండల అధికారులు సైతం కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. ఈ విషయం సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లనునట్లు తెలిపారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు ఇకనైనా స్పందించి గ్రావెల్ అక్రమ రవాణాను అడ్డుకట్ట వేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో బిజెపి మండల ఉపాధ్యక్షుడు చొప్పా వెంకటేశ్వర్లు, బిజెపి సీనియర్ నాయకులు చింతగింజల సుబ్రహ్మణ్యం, రాచపూటి ధనుంజయరావు, బొడ్డు గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

## వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కావ్య



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణం బృందావనం కాలనీ చెందిన వస్త్ర వ్యాపారి ప్రముఖ ఆర్యవైశ్యులు వేమూరి పెద్దిశెట్టి సతీమణి వేమూరి ప్రమీల ఉత్తర క్రియ కార్యక్రమానికి కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి సోమవారం హాజరయ్యారు. అనంతరం ఆమె చేసిన పడడానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే కావలి పట్టణ కోపరేటివ్ కాలనీ గోనుగుంట భారతి ఉత్తర క్రియల కార్యక్రమంలో పాల్గొని ఆమె చిత్రపటాన్ని నివాళులర్పించారు. కుటుంబ సభ్యులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుంటుపల్లి రాజ్ కుమార్, దేవరకొండ శ్రీను, తిరువీధి ప్రసాద్, కావలి మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు తట్టపర్తి రమేష్, శ్రీరామ్ మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

## మాజీ కౌన్సిలర్ కనుపర్తి రాజాకి మాతృవియోగం



**కావలి, మేజర్‌న్యూస్:** కావలి పట్టణంలో 23వ మున్సిపల్ వార్డు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాజీ కౌన్సిలర్ కనుపర్తి రాజశేఖర్ అమ్మ మృతి చెందారు. విషయం తెలుసుకున్న కావలి నియోజకవర్గం వైఎస్ఆర్సిపి ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి విషయం తెలుసుకొని దిగ్భ్రాంతి చెందారు. ఇటీవలే ఆమె వైద్య శాలలో చికిత్స వెళ్లి పరామర్శించడం కూడా జరిగింది. వారి కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబానికి మనోదర్యాన్ని ప్రసాదించాలని వారు కోరుకున్నారు.

## ప్రజా సమస్యల సేకరణ.. గ్రీవెన్స్ డే



**సైదాపురం, మేజర్‌న్యూస్ :** సైదాపురం మండల కేంద్రంలో తహసిల్దార్ కార్యాలయం ప్రాంగణం నందు గ్రీవెన్స్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలు నుండి అర్జీలను సేకరించిన అధికారులు ప్రజల సమస్యలు తహసిల్దార్ కార్యాలయంలో వివిధ రకాల అర్జులను భూ సంబంధిత సమస్యలు, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, కుల ధ్రువీకరణ కోసం పత్రాలు, నివాస దృవీకరణ పత్రాలు, ఇతర రెవెన్యూ సంబంధించిన పనులు కొరకు అర్జీలు అందజేశారు. అర్జీల సమస్యల పరిష్కారానికి స్పందించిన తహసిల్దార్ త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని ప్రజలకు తెలియజేశారు. కార్యక్రమంలో తహసిల్దార్ సుభద్ర, డిప్యూటీ తహసిల్దార్ ఆశాజ్యోతి, ఇతర రెవెన్యూ సిబ్బంది, మండల టిడిపి నాయకుడు గిద్దలూరు శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ ప్రాథమిక పాఠశాలను తనిఖీ

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** పట్టణం లోని ఆదర్శ ప్రాథమిక పాఠశాలను సోమవారం ఉదయగిరి మండల విద్యాశాఖ అధికారి 2తోట శ్రీనివాసులు ఆదర్శ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బోధన అభ్యసన సామాగ్రితో విద్యార్థులకు బోధన చేయవలెనని, సకాలంలో సిలబస్సు పూర్తి చేయలని, విద్యార్థుల హాజరు శాతం పెరిగే విధంగా చూడాలని తెలియజేశారు. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం సంతృప్తిగా ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు షబ్బీర్ ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఆమంచర్లలో అవగాహన సదస్సు



**నెల్లూరు రూరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు రూరల్ మండల ఆమంచర్ల గ్రామం లోని గిరిజన కాలనీ నందు మహిళా శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యం లో జిల్లా స్త్రీ, శిశు సంరక్షణ సాధికారిత అధికారిని బి. హేనసుజన్ ఆదేశాల ప్రకారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అధ్యక్షులుగా సీడీపీఓ అరుణ వహించా రు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి సురేష్ మాట్లాడుతూ.. బాలల చట్టాలు, నూతనంగా బాలల చట్టాలలో వచ్చిన మార్పులు గురించి శిక్షలు గురించి, చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 ఉమెన్ హెల్ప్ లైన్ నెంబర్ 181, 112 సైబర్ క్రైమ్, చైల్డ్ మ్యారేజ్ ప్రొహిబిషన్ ఆక్ట్ గురించి వివరించారు. బాల్యవివాహాల నష్టాలను వాటిని అరికట్టుటకు అందరు తీసుకోవలసిన చర్యలు బాల్య వివాహా లు జరిపించిన వారిపై ఎటువంటి చట్టాలు వర్తింపజేస్తారు. వారికి పడే శిక్ష గురించి, జరిమానాల గురించి వివరించారు. తదుపరి లైంగిక వేధింపుల నుండి ఏవిధంగా రక్షణ కలిగించుకోవాలి. ఫోక్సో చట్టం గురించి, గుడ్ టచ్ బాడ్ టచ్ గురించి అందరికి అవగాహన కల్పించారు. మిషన్ వస్తల్య పథకం ద్వారా వచ్చే స్పాన్సర్ షిప్‌లకు 4 వేల రూపాయలనేది నిస్సహాయ స్థితిలో ఉన్న బాలల కు వైద్యం, విద్యకు ఏవిధంగా ఉపయోగ పడు తుంది. దత్తత గురించి తీసుకోవాలంటే ఆన్‌లైన్‌లో ఎలా నమోదు చేసుకోవాలి. ఇల్లీగల్ అడాప్షన్ వలన కలిగే నష్టాలు గురించి తెలియజేశారు. అనం తరం ఐసిడిఎస్ సీడీపీఓ అరుణ మాట్లాడు తూ.. ఐసీడీఎస్ ద్వారా 0-6 సంవత్సరాల పిల్లలకు సేవలతో పాటు గర్భిణీ, బాలింతలకు సేవల్లో జాప్యం లేకుండా పని చేయడం జరుగుతుందని తెలియజేశారు. అదేవిధంగా అందరికి మా సేవలు అందిస్తున్నాము. మహిళల భద్రతే లక్ష్యంగా మేము పనిచేస్తున్నాం గృహహింస (డివిసి) ద్వారా, సఖి (వన్ స్టాప్ సెంటర్) ద్వారా జిల్లాస్థాయిలో మహిళల భద్రతకు మహిళా చట్టాల అమలకు కృషి చేస్తున్నాం.. వీటి పట్ల అందరూ అవగాహన కల్గి అందరూ మా సేవలను పొం దేలా చూసుకోవాలని మన జిల్లాలో మహిళలకు కానీ, శిశువులకు కాని, ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడడమే మనందరి బాధ్యత అని తెలియజేశారు. కార్యక్రమంలో స్కూల్ ప్రధానోపాధ్యాయులు, సర్పంచ్ రావణమ్మ, కౌన్సిలర్ జోష్నా, ఐసిపిఓ మంజుల, అంగన్వాడీ టీచర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# రియల్ ఎస్టేట్ వ్యాపారంలో మోసగాళ్లపై క్రిమినల్ కేసులు పెట్టాలి

### ముక్కు రాధాకృష్ణ గౌడ్



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** రియల్ ఎస్టేట్ వ్యాపారుల సంక్షేమ సంఘం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పేరుతో నకిలీ డాక్యుమెంట్లతో మోసం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఉదయం 12 గంటలకు స్థానిక ఉమేష్ చంద్ర కాన్ఫరెన్స్ హాలు నందు జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అధికారి కి వినతి పత్రం సమర్పించారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముక్కు రాధాకృష్ణ గౌడ్ మాట్లాడుతూ.. నెల్లూరు నగరంలో ఎన్నో సంవత్సరాలుగా రియల్ ఎస్టేట్ వ్యాపారం ఎంతో హుందాగా కొనుగోలు, అమ్మకాల్లో జరుపుకుంటూ ప్రాపర్టీలు అమ్మకందారులు కొనుగోలుదారులు మధ్యవర్తులు కలసి, మెలసి మంచి సహృద్భావ, ప్రేమ పూర్వక వాతావరణంలో ఎంతో నమ్మకంతో, విలువలతో కూడిన వ్యాపారం జరుగుతూ ఉండేదని, నేడు కొంతమంది మోసగాళ్లు, చీడపురుగులు, నయవంచకులు రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ప్రవేశించి ప్రజలను నిట్ట నిలువునా మోసం చేస్తూ అవినీతి అక్రమాలకు పాల్పడుతూ అక్రమ ధనార్జనే ధ్యేయంగా మూడు నకిలీ డాక్యుమెంట్లు, ఆరు దొంగ ప్లాట్లు అన్నట్లుగా దొంగ డాక్యుమెంట్లు సృష్టించి తమవి, తమవారివి, కాని ప్లాట్లను నకిలీ డాక్యుమెంట్లతో తమవి, తమవారీవిగా సృష్టించి ప్లాట్లను చలామణిలో తెస్తూ కొంతమంది మాఫియాగా ఏర్పడి అమ్మ కాలుకు పాల్పడుతూ విచ్చలవిడిగా చలరేగిపోతున్నారని అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. రియల్ ఎస్టేట్ వ్యాపారుల సంక్షేమ సంఘం దృష్టికి ఇటీవల అలాంటి ఒక ముఠా సభ్యుడైన బోయిల్ల. కృష్ణారెడ్డి, సన్నాఫ్ వెంకటేశ్వర్ రెడ్డి అను అతను చేస్తున్న మోసాలలో కొన్ని తమ దృష్టికి వచ్చాయని అందులో ఒకటి కందుకూరు శ్రీనివాసులు సన్నాఫ్ ఆదిశేషయ్య అను అతనికి దొంగ ప్లాట్లను విక్రయించి దొంగ డాక్యుమెంట్లతో ప్లాట్లను అమ్మ చూపారని, డబ్బులు కట్టించుకున్న తర్వాత ప్లాటును రిజిస్ట్రేషన్ చేయకుండా మొహం చాటేసి మోసం చేశారని ఇదేమని అడిగితే దౌర్జన్యం చేస్తూ చంపుతామని బెదిరిస్తున్నారని తీరా ఆ ప్లాటుకు సంబంధించిన వివరాలు సేకరించగా ఒరిజినల్ ఓనర్లు ఉన్నట్లు తమ విచారణలో తేలిందని వారు సైతం ఈ నకిలీ ముఠాపై కోర్టులో దావా వేసినట్లు తాము గుర్తించామని కావున పై విషయాలన్నీ కూడా సంబంధిత పోలీస్ అధికారులు దృష్టికి తీసుకెళ్లామని తద్వారా బాధితుడికి తగు న్యాయం చేయాలని కోరామని చెప్పారు. మునుముందు ఇంకా వీటిపై అధికారుల దృష్టికి తీసుకెళ్తామని, అవసరమైతే న్యాయ పోరాటం చేస్తామని దోషులను కఠినంగా శిక్షించే వరకు పోరాడుతామని ఆయన చెప్పారు. పై కార్యక్రమంలో రియల్ ఎస్టేట్ వ్యాపారుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు దినేష్ నాయుడు జిల్లా అధ్యక్షులు కందుకూరి శ్రీనివాసులు జిల్లా నాయకులు జే. అవినాష్, ఎం. రవి పాల్గొన్నారు.

# డిప్యూటీ కమీషనర్‌కు వినతి పత్రం



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగర మునిసిపాలిటీ పరిధిలోని, స్టోన్ హౌస్ పేట మండలం, 10వ వార్డు నందు కుక్కల బెడద, రోడ్లు గుంతలు, కలుషిత తాగునీరు కొలాయిల నుండి వస్తున్నందున ప్రజలు ఇబ్బందులకు గురవుతున్న పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సమస్యలను నెల్లూరు నగర డిప్యూటీ కమీషనర్ దృష్టికి మండల అధ్యక్షుడు కోసూరు వెంకట సుధీర్ ఆధ్వర్యంలో తీసుకు వెళ్లి వారికి పరిస్థితులను వివరించి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు కోసూరు వెంకట సుధీర్, బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి హర్ష వర్ధన్, బీజేపీ మండల నాయకులు తన్నీరు సుబ్బారావు, హరి, సురేష్, నరేష్ పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులు కల్పించాలని నిరసన



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని సకినాలపల్లి పంచాయతీ కుర్రపల్లి బీసీ కాలనీవాసులు ఉపాధి హామీ పనులు కల్పించాలని సోమవారం స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీలో అన్ని గ్రామాలకు కాలనీలకు ఉపాధి హామీ పనులు కల్పిస్తూ తమ కాలనీకి మాత్రం కల్పించలేదన్నారు. కాలనీవాసులంతా కూలీనాలి చేసుకొని జీవనం సాగించేవారన్నారు. 3 నెలలుగా పని కల్పించకపోవడంతో కుటుంబ పోషణ భారమైందని వాపోయారు. గత నెలలో అధికారులకు ఫిర్యాదు చేస్తే పని కల్పిస్తామని చెప్పారని, ఇంతవరకు పని కల్పించిన దాఖలాలు లేవన్నారు. అనంతరం ఎంపీడీవో అప్పాజీకి వినతిపత్రం అందజేశారు. స్పందించి ఆయన త్వరలోనే కాలనీవాసులు పని కల్పిస్తామని హామీ ఇచ్చారు.

# అన్నా క్యాంటీన్ నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



**వింజమూరు, మేజర్‌న్యూస్ :** వింజమూరు తహసిల్దార్ కార్యాలయ సమీపంలో నిర్మాణం అవుతున్న అన్నా క్యాంటీన్ భవన నిర్మాణ పనులను సోమవారం ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఇతర నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం అన్నా క్యాంటీన్లను ప్రారంభించారు. అందులో భాగంగానే వింజమూరులో నిర్మాణమవుతున్న అన్న క్యాంటీన్ భవనం త్వరలో పూర్తిచేసుకుని ఉపయో గంలోకి రానుందని తెలిపారు. ఈ నిర్మాణం పూర్తి కాగానే అనేకమంది పేద ప్రజలకు కార్మికులకు మూడు పూటలా భోజనం వసతి కల్పించేందుకు వీలవుతుందని తెలిపారు. పేదవానికి గుప్పెడు మెతుకులు అందిస్తే ఎంతో పుణ్యం అని, ఆ పుణ్యకార్యంగా భావించి ముఖ్యమంత్రి చంద్రబాబు వీటిపై దృష్టి సారించారన్నారు. ఈ క్యాంటీన్లను పారదర్శకంగా నిర్వహించే పేద ప్రజలకు కార్మికులకు పట్టడం పెట్టే విధంగా నాయకులూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు చల్లా శ్రీనివాసులు, జూపల్లి రాజారావు, బోసు మహేష్ యాదవ్, చేబ్రోలు వసంతరావు, ఆనంగి రమణయ్య, గువ్వల కృష్ణారెడ్డి, కోడూరు నాగిరెడ్డి, చల్లా శ్రీనివాసులు యాదవ్, గురజాల వాసు నాయుడు, ఎమ్మెస్ నాయుడు, కెఎస్ నాయుడు, తిరుపతి ఆచారి, పి మాల్యాద్రి, శ్రీనివాసులు రెడ్డి, ఇతర నాయకులు కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

### జిల్లాలో యూరియా

# దుర్వినియోగాన్ని అరికట్టాలి



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** జిల్లాలో యూరియా దుర్వినియోగాన్ని అరికట్టాలి జిల్లా కలెక్టర్ ఆనందుకు బిజెపి నేత మిడతల రమేష్ విజ్ఞప్తి చేశారు. నెల్లూరు జిల్లాలో 2 లక్షల ఎకరాలలో వరి సాగు జరుగుతుంది. ప్రభుత్వం 42 వేల టన్నుల యూరియాను రైతులకు అందించింది. ఈ వ్యవసాయ సీజన్ కు వినియోగం తర్వాత తదుపరి సీజన్ కు కూడా యూరియా అందుబాటులో ఉంటుంది. సబ్సిడీ ద్వారా యూరియా అందుబాటులో ఉందని లక్ష ఎకరాలలో జామాయిల్ సరుగుడు టేకు చెట్లకు యూరియా వినియోగిస్తున్నారు. ఈ చెట్లకు అనవసరంగా యూరియా వినియోగం చేయడం వలన యూరియా దుర్వినియోగం అవుతోంది. పశువుల పచ్చి గడ్డికి 30 వేల ఎకరాలలో యూరియా ఉపయోగించారు. ఉద్యానవన పంటలు పూలు పండ్లు కూరగాయలు అన్నింటికి యూరియా వినియోగిస్తున్నారు. ఎకరాకు రెండున్నర బస్తాల యూరియా వాడాల్సి ఉంటే ఐదారు బస్తాలు ఉద్యానవన పంటలు మినహాయిస్తే ఒకటిన్నర లక్ష ఎకరాలలో అవసరం లేకున్నా యూరియా వినియోగం ద్వారా దుర్వినియోగం జరుగుతోంది. యూరియా నిల్వలు పక్కదోవ పట్టకుండా వ్యవసాయ రెవెన్యూ పోలీస్ వ్యవస్థలు సమిష్టిగా కృషి చేసి యూరియా దుర్వినియోగాన్ని అరికట్టాలని ప్రభుత్వానికి రమేష్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రఘురామయ్య నగేష్, లక్ష్మణరావు, నారాయణరావు. ఏవి సుబ్బయ్య ఆదినారాయణ, ఓజిలి సుధాకర్, వెంకట్రావు పాల్గొన్నారు.

# అంతులేని అభిమానం.. వీబీఆర్‌కే సొంతం

**ఘనంగా వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు - భారీగా తరలివచ్చిన అభిమానులు ప్రజాప్రతినిధులు కార్యకర్తలు**





**నెల్లూరు అర్బన్/క్రైమ్, మేజర్‌న్యూస్ :** వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి.. ఈ పేరు తెలియని వాళ్లు బహుశా నెల్లూరు జిల్లాలోనే కాదు మన తెలుగు రాష్ట్రాలలో తెలియని వారు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. సాధారణ ఉద్యోగి స్థాయి నుండి అంచెలంచెలుగా ఎదిగి 42 సంవత్సరాలు నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్‌గా.. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ముఖ్య శ్రేయోభిలాషిగా అందరికీ సుపరిచితులే. సోమవారం విజయ్ భాస్కర్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఆయన అభిమానులు, కార్యకర్తలు, నారాయణ విద్యాసంస్థల ఉద్యోగులు, బంధువులు ఇలా చెప్పుకుంటూపోతే వేలాది మంది ఆత్మీయులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. దేశవ్యాప్తంగా వెయ్యికిపైగా ఉన్న నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్‌గా ఆయన వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించి వారి కుటుంబాల్లో వెలుగులు నింపారు. అలాగే మధ్యతరగతి కుటుంబాలకు చెందిన కార్యకర్తలను అత్యధికంగా ఆదుకుంటూ వారి ఆదరాభిమానాలు పొందారు. తన వద్దకు ఏ పని కోసం వచ్చిన తక్షణమే స్పందించి పరిష్కరించే విజయ్ అన్నకు పుట్టినరోజు సందర్భంగా అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. కుల మతాలకు అతీతంగా ఆయనకు వేద ఆశీర్వచనాలు అందజేస్తున్నారు.

# రాచమల్లు రమేష్‌ని వెంటనే ఖాళీ చేయించాలి : సిపిఎం

**నెల్లూరు రూరల్, మేజర్ న్యూస్ :** నెల్లూరు రూరల్ మండలం ఆమంచర్ల పంచాయతీ మట్టింపాడు గ్రామంలో 20 ఎకరములను అన్యాక్రాంతం చేస్తున్న రాచమల్లు రమేష్ పై చర్యలు తీసుకోవాలని నెల్లూరు రూరల్ మండల రెవెన్యూ అధికారి కృష్ణ ప్రసాద్‌కి నెల్లూరు రూరల్ సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగినది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆలూరు తిరుపాలు మండల కార్యదర్శి పూడిపర్తి జనార్ధన్లు మాట్లాడుతూ.. ఎలాంటి హక్కులు లేకపోయినా రాచమల్లు రమేష్‌పై 145 సెక్షన్ అమలులో ఉన్నప్పటికీ ఎవరిని లెక్కచేయకుండా గ్రామంలోకి పోయేబాటతో సహా 20 ఎకరములను ఆక్రమించి గుంటలు తీసి టెంకాయ మొక్కలు నాటుతున్నాడని, అక్కడే గెస్ట్ హౌస్‌ను నిర్మించి వాటర్ ట్యాంకును ఏర్పాటు చేశాడని దీనిపై నెల్లూరు రూరల్ టు మండల రెవెన్యూ కృష్ణ ప్రసాద్‌కి రెవెన్యూ అధికారులకు తెలియజేసినప్పటికీ అతనిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం ఎవరి అండతో ఈ పనులు పనులు కొనసాగించడం జరుగుతుందో అర్థం కావడం లేదని అన్నారు. దీనిపై నెల్లూరు రూరల్ మండల రెవెన్యూ అధికారి ని అడగగా ఇతనినీ బైండోవర్ చేసుకోమని చెబుతున్నాడని, కానీ రాచమల్లు రమేష్ మాత్రం తన పనిని యధావిధిగా కొనసాగిస్తున్నాడనీ అన్నారు. కాబట్టి వెంటనే ఇతనిపై చర్యలు తీసుకొని మొక్కలు నాటడాన్ని ఆపించాలని నెల్లూరు రూరల్ మండల రెవెన్యూ అధికారిని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీపతి వెంకయ్య, శ్రీపతి దయాకర్, మల్లే సింహగిరి, దారా శివయ్య, గ్రామస్తులు ఎన్వి రమణయ్య, పెంచలయ్య, దయాకర్, దువ్వూరు పెంచలయ్య దువ్వూరు మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.



## ఫిర్యాదులే.. పరిష్కారం మార్గం చూపెట్టరా ?

**కృష్ణపట్నం భూముల ఆక్రమణపై స్థానికులు ఆవేదన**



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** ఫిర్యాదులు చేయడమే తప్ప కృష్ణపట్నం భూముల ఆక్రమణపై రెవెన్యూ శాఖ అధికారులు పరిష్కారం చూపలేకపోతున్నారని కరణాల వీధి కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేసినాయి. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో రెండోసారి వినతి పత్రాన్ని తాసిల్దార్ స్వప్నకు అందజేశారు. బకింగ్ హామ్ కెనాల్ సముద్ర తీర ప్రాంతం మధ్య ఉన్నటువంటి భూములు తమ ఆధీనంలో ఉంటూ జీవనం సాగిస్తున్నామని కొంతమంది అక్రమార్కులు ఈ భూములు ఆక్రమించుకుంటూ వస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ పరిష్కారం కోసం అధికారులను కలిశారు. ఈ సందర్భంగా స్థానిక అధికార పార్టీ నాయకులు వై కోదండరామయ్య అధికారులతో మాట్లాడారు. భూముల అక్రమణ అడ్డుకోవాలని తాసిల్దారును కోరారు. తదుపరి కరణాల వీధికి చెందిన గ్రామస్తులు మాట్లాడారు. అధికారులు చర్యలు తీసుకుంటున్నారోలేదో తెలియదు గాని, భూముల ఆక్రమణ మాత్రం రాత్రివేళ చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు మేల్కొని భూములు ఆక్రమణకు గురికాకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఏడుకొండలు, శ్రీధర్, నాగూరయ్య, వెంకటసుబ్బయ్య, సురేంద్ర, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం




**కావలి, మేజర్ న్యూస్:** కావలి పట్టణంలో స్థానిక బాపూజీ నగర్‌లో రావెల జైపాల్ ఆధ్వర్యంలో కోరీ స్వచ్ఛంద సేవా సంస్థను గత కొన్ని సంవత్సరగాలుగా నిర్వహిస్తున్న విషయం అందరికీ తెలిసిందే, ఈ స్వచ్ఛంద సేవా సంస్థ ద్వారా కావలి నియోజకవర్గం లోని నిరుపేద గ్రామాలలో సోమవారం కొరిడ్ సంస్థ ఆధ్వర్యంలో సంస్థలో పనిచేస్తున్న నిరుపేద ప్రజలకు ఉచితంగా కంటి వైద్యం డాక్టర్. సుధాకర్ వైద్యశాలలో నిర్వహించారు. అనంతరం కంప్యూటర్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలు డాక్టర్ సూచనల మేరకు అందించడం జరిగింది. అంతేకాకుండా రానున్న రోజుల్లో ఈ సంస్థ ద్వారా ఇంకా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ రావేల జైపాల్ తెలిపారు. ఈ కంటి వైద్య శిబిరానికి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొనడం విశేషం. ఈ కార్యక్రమంలో కోరిడ్ సంస్థ సూపర్వైజర్ దంతం సునీల్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## ఆత్మకూరు మండల సర్వేయర్‌గా వెంకటేశ్వర్లు



**ఆత్మకూరు,మేజర్‌న్యూస్:** ఆత్మకూరు మండల రెవిన్యూ సర్వేయర్‌గా ఎల్.వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఆయన సైదాపురం నుండి ఆత్మకూరుకు బదిలీకాగా గతనెల 21వ తేదీన బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న సర్వేయర్ రాజా సంగం మండలానికి బదిలీ అయ్యారు. ఈసందర్భంగా నూతన సర్వేయర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తమవంతుగా విధులను చిత్తశుద్ధిగా నిర్వహిస్తానని, రైతుల సమస్యలను పరిశీలించి వీలైనంత త్వరితగతిన పరిష్కారిస్తానని, ఉన్నతాధికారుల ఆదేశాలను శిరసావహిస్తానని, ఆమేరకు తాను విధులను నిర్వహిస్తానని వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

## సాగరమాల ప్రాజెక్టు నిర్మాణానికి రైతులు సహకరించాలి



**ముత్తుకూరు, మేజర్‌న్యూస్ :** సాగర మాల ప్రాజెక్టు నిర్మాణానికి భూములు కోల్పోతున్న రైతులు అవార్డు విచారణకు సహకారం అందించాలని పారిశ్రామిక అభివృద్ధి చాలా అవసరమని ఆర్డిఓ నాగ అనూష అన్నారు. సోమవారం ఈపూరు -1బి, నారికేల్లపల్లి గ్రామపంచాయతీల్లో జాతీయ రహదారి నిర్మాణానికి 83 సెంట్లు భూమి తీసుకుంటున్న నేపథ్యంలో అధికారులు రెవెన్యూ కార్యాలయంలో అవార్డు విచారణ నిర్వహించారు. 6 మంది రైతులకు నోటీసులు జారీ చేశారు. అనంతరం ఆర్డీవో విలేకరులతో మాట్లాడారు. అభ్యంతరాలు ఉన్నట్లయితే మరల జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేసుకోవచ్చన్నారు. విచారణకు రైతులు హాజరైతేనే పరిశ్రమలు అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ స్వప్న, గ్రామ రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పీహెచ్చెసీని తనిఖీ చేసిన డిప్యూటీ డీఎంహెచ్ఓ



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** మండలంలోని చిరమణ, ఏఎస్ పేట గ్రామాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను అదనపు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖధికారి డాక్టర్ షేక్. ఖాదర్ వలి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని వార్డ్, ల్యాబ్‌లను పరిశీలించారు. అలాగే రోగులకు సంబంధించిన రికార్డులను, ల్యాబ్‌లో చేయు పరీక్షలు, రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే పీహెచ్సీలో పనిచేస్తున్న సిబ్బందికి సలహాలు సూచనలు అందించారు. అలాగే ఏఎస్ పేటలో జరుగుతున్న ఎఫ్‌పిసి ప్రోగ్రాంలో పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో చిరమణ ఏఎస్పేట పిహెచ్సి వైద్యాధికారులు డాక్టర్ కంచర్ల నాగవినూత, డాక్టర్ ఆయేషా సుల్తానా, ఎంపిహెచ్ఈఓ షేక్ షఫీ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## దోమల నివారణకు చర్యలు



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** లార్వాదశలో ఉన్న దోమల అభివృద్ధి చెందకుండా నీటి వనరులు గుబిసియ చేప పిల్లలను వదులుతున్నట్లు గండిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిని శివ కల్పన పేర్కొన్నారు. జాతీయ డెంగ్యూ మాసోత్సవంలో భాగంగా సోమవారం పట్టణంలోని ఆనకట్ట కోనేరు నీటిగుంటలో గంబుషియా చేపతలను వదిలారు అనంతరం ఆమె మాట్లాడుతూ దోమలను నివారించడం వల్ల మలేరియా డెంగ్యూ చికెన్ గున్య మెదడువాపు తదితర కీటక జనిత వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా సభ్యులు అధికారి నౌషద్ బాబు హెచ్ ఈ వెంకటసుబ్బయ్య వైద్య ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మట్టితోలకం రైతులకు ఇబ్బందికరం.. ఆర్డీవోకు రైతుసంఘ వినతి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు చెరువునుండి ఎలాంటి అనుమతులు లేకుండా నియమాలు పాటించకుండా కొందరు అక్రమంగా మట్టిని తరలిస్తున్నారని, ఈవిషయమై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘ ప్రధానకార్యదర్శి లక్కు కృష్ణప్రసాద్ తదితరులు కోరారు. ఈమేరకు సోమవారం వారు స్థానిక ఆర్డీవో భూమిరెడ్డిపావనికి ఒక వినతిపత్రం అందజేసి వివరాలను కూడా చర్చించారు. చెరువునుండి పట్టణ సమీపంలోని ఒక కాలేజి ఆవరణకు అధికంగా తోలుతున్నారని వారు పేర్కొన్నారు. సర్వేనెంబర్ 581, 1901లో సామలరామయ్య, జానకమ్మ ఎడ్యుకేషనల్ ట్రస్ట్‌కు ప్రభుత్వం మార్కెట్ విలువతో 15ఎకరాలను ఇచ్చారని వారు పేర్కొన్నారు. కాగా ఈ స్థలానికి చెరువునుండి ఇటీవల దాదాపు 2లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తోలారని వారు వివరించారు. ఒక క్యూబిక్ మీటరుకు 200 రూపాయలు చెల్లించాల్సిన జివో74 ఉందన్నారు. చెరువులనుండి సిల్ట్ మాత్రమే తొలగించాలని, నియమనిబంధనలు పాటించాలని పలురకాల ఉత్తర్వులిచ్చారన్నారు. కానీ ఆత్మకూరు చెరువునుండి ఎలాంటి ఫీజులు చెల్లించకుండా నిబంధనలు పాటించకుండా మట్టిని తరలిస్తున్నారన్నారు. ఇందుకుగాను దాదాపు 300 నల్లతుమ్మ చెట్లను కూడా నరికేవారని వివరించారు. దాంతో పర్యావరణం పూర్తిగా దెబ్బతిన్నదన్నారు. ఈ విషయమై ఇరిగేషన్ అధికారులకు అర్జీ ఇచ్చినా ఎలాంటి చర్యలు లేవన్నారు. ఈ మట్టి తరలింపు వలన చెరువుకట్టకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందన్నారు. కాలువల మరమ్మత్తులకు నిధులు లేవనే అధికారులు మట్టితరలింపుకు నిబంధనలమేరకు నగదు వసూలు చేస్తే సరిపోతుందికదా అని ప్రశ్నించారు. వారినుండి ఫీజు వసూలు చేయకున్నా చోద్యం చేస్తున్నారని, మట్టి తోలకందారులకు సహకరిస్తున్నారని ప్రసాద్ ఆర్డీవోకు వివరించారు. తాను వారంలోగా సమగ్ర విచారణ జరిగిపన అనంతరం వివరాలు తెలియజేస్తానని ఆర్డీవో పావని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో రైతుసంఘ అధ్యక్షుడు కృష్ణమోహన్, కౌలురైతుసంఘ జిల్లా నాయకుడు గంటా లక్ష్మిపతి, పలువురు సంఘ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# అక్రమ లేఅవుట్లపై దృష్టి సారించిన మున్సిపల్ అధికారులు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్:** ఆత్మకూరు పరిధిలోని అక్రమలేఅవుట్లపై మున్సిపల్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. చర్యలకు పూనుకున్నారు. ఇప్పటికే 16 లే అవుట్లను అనధికారికమని నిర్ధారించుకున్నారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా లేఅవుట్లను ఏర్పాటు చేసి వాటి యజమానులు లక్షలరూపాయలు గడిస్తున్నారని అధికారులు గుర్తించారు. లేఅవుట్లు వేసిన యజమానులు ఎలాంటి అనుమతులు లేకుండా కొనసాగుతుండడాన్ని మున్సిపల్ అధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. చర్యలకు ఉపక్రమించారు. నెల్లూరు–ముంబాయి జాతీయరహదారి అంచున జెసిబిలతో ప్లాట్లకు వేసిన హద్దురాళ్ళను అధికారులు తొలగించారు. డ్రైన్లు ధ్వంసం చేయడం, రోడ్లు బ్లాక్ చేయడం తదితర పనులు చేస్తుండగా అధికారులు అడ్డుకున్నారు. కొందరు యజమానులు అధికారులతో గొడవలకు కూడా దిగారు. కానీ అనుమతులు లేకుండా నియమాలు పాటించకుండా అక్రమంగా లేఅవుట్లను ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు.

# సమస్యలపరిష్కారానికి ప్రత్యేక చర్యలు : తహసిల్దార్



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :**మండలంలో ప్రజల, ప్రధానంగా రైతుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటామని తహశిల్దారు పి.పద్మజాకుమారి పేర్కొన్నారు. సోమవారం ఆమె తమ కార్యాలయంలో ప్రజాసమస్యలపరిష్కారవేదిక కార్యక్రమం నిర్వహించి విచ్చేసిన ప్రజలనుండి అర్జీలు స్వీకరించడంతోపాటు వారినుండి వివరాలను సమగ్రంగా తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సోమవారం ఇచ్చే అర్జీలకు చట్టబద్ధత ఉంటుందని, నమోదు చేసుకుంటామని, మిగతా రోజుల్లో ఇచ్చే అర్జీలకు కూడా ప్రాధాన్యత ఉంటుందన్నారు. ప్రజలిచ్చే అర్జీల్లోని సమస్యలను రికార్డుల ఆధారంగా, అనుభవాల ఆధారంగా, వివిద విచారణల ద్వారా తెలుసుకుంటామని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పద్మజాకుమారి పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు ప్రలనుండి వచ్చే అర్జీలను విఆర్వోలు, రెవిన్యూ ఇన్స్‌పెక్టర్, మండల సర్వేయర్, సచివాలయాల సర్వేయర్లు తదితరులకు పంపి సమగ్ర విచారణ చేయిస్తుంటామని, నివేదికలు రాగానే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహశిల్దారు వెల్లడించారు. ఈకార్యక్రమంలో వివిద శాఖల అధికారులు, కార్యాలయ సిబ్బంది, ఆర్ఐ,సర్వేయర్, విఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

# బట్టేపాడు సొసైటి అధ్యక్షుడుగా తూమాటి.. సభ్యులుగా గార్లపాటి, కిలారి

  

**ఆత్మకూరు,మేజర్‌న్యూస్:** ఆత్మకూరు మండలం బట్టేపాడు ప్రాధమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (పిఏసిఎస్) అధ్యక్షుడుగా అదే గ్రామానికి చెందిన తూమాటి ధనుంజయరెడ్డిని ప్రభుత్వం నియమించింది. సొసైటికి త్రిసభ్యకమిటీని నియమించగా అందులో ధనుంజయరెడ్డి అధ్యక్షుడుగా నియమితులయ్యారు. తెలుగుదేశం నాయకుడైన ధనుంజయరెడ్డి గతంలో బట్టేపాడు సర్పంచ్‌గా వ్యవహరించారు. ఆయన అన్నకుమారుడు డాక్టర్ తూమాటి శశిధర్‌రెడ్డి ఎంపిటిసి మెంబర్‌గా కొనసాగుతున్నారు. సభ్యులుగా కరటంపాడుకు చెందిన తెలుగుదేశం నాయకుడు, మాజీ ఉపమండలాధ్యక్షుడు, మాజీ సర్పంచ్, గార్లపాటి ఫౌండేషన్ డైరెక్టర్ గార్లపాటి వేణుగోపాల్‌నాయుడు , అప్పారావుపాళెంకు చెందిన నియోజకవర్గ తెలుగుదేశం నాయకుడు కిలారి సుబ్బహ్మణ్యం నాయుడులు నియమితులయ్యారు. ఈమేరకు అధికారులు ఉత్తర్వులివ్వగా బాధ్యతలు కూడా స్వీకరించారు. రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆశీస్సులతో వారు నియమితులయ్యారు. వారు మంత్రి రామనారాయణరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## గవర్నర్‌గా నియమితులైన అశోక్ గజపతిరాజును అభినందించిన మంత్రి ఆనం



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** తెలుగుదేశం సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి, మాజీ ఎంపి పూసపాటి అశోక్ గజపతిరాజు గోవా గవర్నర్‌గా నియమితులైన సందర్భంగా రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అభి నందించారు. అశోక్ గజపతి రాజు నియామకంపట్ల ఆనం అత్యంత హర్షం వ్యక్తం చేయడంతోపాటు ఆయనకు శాలువా, పుష్పగుచ్ఛంలతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఆయన నియామకంతో తెలుగు ప్రజల సామర్థ్యం, నాయకత్వ విలువలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందుతున్నాయనేందుకు తార్కాణమని, అందుకు ఈ నియామకం రుజువుచేస్తుందని రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. అశోక్‌గజపతిరాజు సుధీర్ఘరాజకీయానుభవం, పాలనాపరమైన పరిజ్ఞానం గోవా రాష్ట్ర అభివృద్ధికి మార్గదర్శకంగా నిలుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. గజపతిరాజు ఈ నూతన బాధ్యతల్లో అన్నిరకాల విజయాలు , ఉజ్వల భవిష్యత్తు ఉండాలని కోరుకుంటున్నానని మంత్రి రామనారాయణరెడ్డి పేర్కొన్నారు.

## ఆత్మకూరు డిప్యుటి ఎంపిడివోగా భువనేశ్వరి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలపరిషత్ కార్యాలయ డిప్యుటి ఎంపిడివోగా పి.భువనేశ్వరి నియమితై సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా పంచాయతీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వమిస్తున్న భువనేశ్వరి పదోన్నతిపై ఆత్మకూరు డిప్యుటి ఎంపిడివోగా నియమితులయ్యారు. ఆమెకు కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. తనవంతుగా మండల ప్రజలకు అంకిత భావంతో సేవలందిస్తానని, తమ విధులను చిత్తశుద్ధిగా నిర్వహిస్తానని భువనేశ్వరి పేర్కొన్నారు.

## వాడవాడలా సుపరిపాలన తొలి అడుగు



**ఆత్మకూరు,మేజర్‌న్యూస్:** ఆత్మకూరు పట్టణంలోని అన్నివార్డుల్లోని వాడవాడలా తెలుగుదేశం నాయకులు ముమ్మరంగా పర్యటిస్తూ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. రాష్ట్ర దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాలమేరకు సోమవారం పట్టణ తెలుగుదేశం అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, జిల్లా తెలుగుయువత మాజీ ఉపాధ్యక్షుడు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడులు పలువార్డుల్లో పర్యటించారు. ఆయావార్డుల టిడిపి ప్రజాప్రతినిధులు, అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జ్‌లు, నాయకులతో కలిసి ఇంటింటా పర్యటించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ ఏడాదిలో అమలుచేసిన ఎన్నికల నాటిహామీలు, సంక్షేమపథకాలు, చేస్తున్న అభివృద్ధి గురించి వివరించడంతోపాటు అందరికీ ఆ వివరాలతో కూడిన కరపత్రాలను అందజేశారు. హామీలు అమలుచేయలేదన్న ప్రతిపక్షాల విమర్శలను త్రిప్పికొట్టాలని, ఈ ఏడాదిలో పెన్షన్ పెంచి ఇవ్వడం, గ్యాస్‌సిలిండర్లు ఉచితంగా ఇవ్వడం, తల్లికివందనం పేరుతో వారి ఖాతాల్లో నగదు జమచేయడం, మెగాడిఎస్‌సి నిర్వహించడం, తదితరాలను వారు వివరించారు. ఈనెలలో రైతులకు అన్నదాతసుఖీభవ పథకం నిధులు జమచేస్తామని, ఆగస్టులో మహిళలకు ఉచిత బస్‌సౌకర్యం కల్పిస్తామని తుమ్మల చంద్రారెడ్డి పేర్కొన్నారు. ఏడాదిలోనే ఇచ్చిన అనేక హామీలు అమలుచేశామని, అంచెలంచెలుగా మిగతా హామీలు కూడా నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రణాళికలు రూపొందించారని ఆయన వివరించారు. కార్యక్రమంలో తెలుగుదేశం నాయకులు తోట సందీప్, కొప్పోలు చిన్నపురెడ్డి, పాలేటి శేషారెడ్డి, వేళ్ళ సుమతి, ప్రదీప్, పలువురు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ మద్యం కేసులో కాకాణికి 28 వరకు రిమాండ్

## గూడూరు కోర్టు ఉత్తర్వులు - కాకాణిపై ఇది పదహారో కేసు



**నెల్లూరు లీగల్, మేజర్‌న్యూస్ :** పొదలకూరు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని విరువూరు గ్రామ సమీపములోని రైస్ మిల్లులో 2024 ఏప్రిల్ 24న అక్రమంగా మద్యం బాటిళ్లను నిలువ చేశారని నమోదైన కేసులో 9వ నిందితుడైన గోవర్ధన్ రెడ్డిని ఈనెల 28 వరకు జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించాలని గూడూరు అదనపు జుడిషియల్ మెజిస్ట్రేట్ బివి సులోచన రాణి సోమవారం ఆదేశాలు జారీ చేశారు. తొలుత పొదలకూరు ఎక్సైజ్ పోలీసులు జిల్లా జైలులో ఉన్న కాకాని గోవర్ధన్ రెడ్డిని పిటి వారెంట్‌పై గూడూరు అదనపు మెజిస్ట్రేట్ కోర్టులో సోమవారం హాజరు పరిచారు. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ కేసులో కాకాని గోవర్ధన్ రెడ్డిని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించాలని ఎక్సైజ్ పోలీసులు రిమాండ్ రిపోర్టు కోర్టులో దాఖలు చేసి జుడిషియల్ రిమాండ్‌కు తరలించాలని పోలీసులు కోర్టును అభ్యర్థించారు. పోలీసులు నమోదు చేసిన ఎక్సైజ్ కేసులో నిందితుడు కాకాని గోవర్ధన్ రెడ్డిపై కనీస ప్రాథమిక సాక్షాదారలు లేవని, అలాగే రాజకీయ కక్షతో గోవర్ధన్ రెడ్డిపై అక్రమంగా కేసులు బనాయించారని గోవర్ధన్ రెడ్డి తరఫున న్యాయవాదులు వాదించి, గోవర్ధన్ రెడ్డిని రిమాండ్‌కు తరలించ కూడదని వాదించారు. ఇరుపక్షాల వాదనలను విన్న న్యాయమూర్తి నిందితుడు కాకాని గోవర్ధన్ రెడ్డిని జ్యాడిషల్ రిమాండ్‌కు తరలిస్తూ.. పైమేర ఉత్తర్వులు జారీ చేశారు. కాగా మాజీ మంత్రి, వైసిపి నాయకులు గోవర్ధన్ రెడ్డి ప్రస్తుత ఎక్సైజ్ కేసుతో సహా మరో 15 క్రిమినల్ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని ఎక్సైజ్ పోలీస్ ఇన్స్పెక్టర్ కోర్టులో దాఖలు చేసిన రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. కోర్టు ఉత్తర్వులు ప్రకారం గోవర్ధన్ రెడ్డిని ఎక్సైజ్ పోలీసులు జిల్లా జైలుకు తరలించారు.


సూర్య నేటి దినపత్రిక
# విలేకర్లు కావలెను
తెలుగు పత్రిక రంగంలో అందరి మన్ననలు పొంది పాఠకుల హృదయాలను దోచుకున్న నేటి దినపత్రిక సూర్య నందు విలేకర్లుగా పనిచేయుటకు ఉత్సాహవంతులైన యువతీ యువకులు కావలెను.
కావలసిన సెంటర్లు
నెల్లూరు జిల్లాలోని సంగం, కొడవలూరు, మనుబోలు, అల్లూరు, దగదర్తి, కొండాపురం, కలిగిరి, కలవాయి, విడవలూరు, ఇందుకూరుపేట, కోవూరు, నెల్లూరు పట్టణంలోని దర్గామిట్ట, స్టోన్ హౌస్‌పేట, బాలాజీ నగర్‌లలో విలేకర్లు కావలెను
మీ పూర్తి బయోడేటాతో వారంలోపు క్రింది చిరునామాలో సంప్రదించగలరు.
నేటి దినపత్రిక సూర్య కార్యాలయం
మిలటరీ కాలనీ, రోడ్ నెం.1,ఎల్ఐసి & సిఐడి ఆఫీసు ఎదురుగా,
కొండాయపాలెం గేట్ సెంటర్, నెల్లూరు
9000118811, 9000483583

# పీజీఆర్ఎస్ అర్జీలను సకాలంలో పరిష్కరించాలి

## కలెక్టర్ ఆనంద్ - ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 555 అర్జీలు



**నెల్లూరు, కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో ప్రజలు అందిస్తున్న అర్జీలను జాప్యం లేకుండా సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ ఆనంద్ అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో కలెక్టర్ ఆనంద్ ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు డిఆర్ వో హుస్సేన్‌సాహెబ్, డ్వామా పీడీ గంగా భవాని, జిల్లా పంచా యతీ అధికారి శ్రీధర్ రెడ్డి అర్జీలను స్వీకరిం చారు. ఈ సందర్భం గా కలెక్టర్ మాట్లాడు తూ వివిధ సమస్యలపై ప్రజలు అందించిన అర్జీ లను వెంటనే పరిష్కరిం చేందుకు ఆయాశాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా భూసమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలకు సంబంధించి అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్నారు. ప్రతి అర్జీని కూడా క్షుణ్ణంగా పరిశీలించి ప్రజలు సంతృప్తి చెందేలా నిర్దిష్ట గడువులోగా నాణ్యమైన పరిష్కారం చూపించాలని, పరిష్కరించలేని సమస్యను ఎందుకు పరిష్కరించలేకపోతున్నారో అర్జీదారులకు వివరించాలన్నారు.

### ప్రజాసమస్యల పరిష్కార వేదికకు 555 అర్జీలు

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 555 అర్జీలను ప్రజలు అందజేశారు. వీటిలో ఎక్కువగా రెవెన్యూశాఖకు సంబంధించి 215, మున్సిపల్‌శాఖకు సంబంధిం చి 43, సర్వేకు 48, పంచాయతీరాజ్‌శాఖకు 53, పోలీసు శాఖకు 52, సివిల్ సప్లయిస్‌కు విభాగానికి సంబంధించి 8 అర్జీలు అందాయి. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ నిర్దిష్ట గడువులోగా అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

## నవరాత్రి ఉత్సవాల గోడ పత్రికను

### ఆవిష్కరించిన ఎమ్మెల్యే కావ్య



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో శ్రీకలుగోళం శాంభవి దేవి ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్న తొమ్మిదవ గణేష్ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు గణేష్ ఉత్సవ కమిటీ శ్రీకారం చుట్టారు. ఈ నవరాత్రి ఉత్సవాలకు సంబంధించిన గోడపత్రికను సోమవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి చేతుల మీదుగా గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ నవరాత్రి ఉత్సవాలు ఆగస్టు 27వ తేదీ నుండి సెప్టెంబరు 4వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో మలిశెట్టి వెంకటేశ్వర్లు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 17న బీసీ సంఘం జాతీయ మహాసభను

# విజయవంతం చేయండి



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈనెల 17న నిర్వహించే జాతీయ మహాసభను విజయవంతం చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పెరుమాళ్ళ పద్మజ యాదవ్ పేర్కొన్నారు. ఈ మేరకు నెల్లూరులో ఆమె సోమవారం మాట్లాడుతూ బీసీల హక్కులతో పాటు అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం తాము నిరంతరం పోరాటం చేస్తున్నామన్నారు. చట్ట సభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లలో బిసి మహిళల వాటా తేలాలన్నారు. బీసీ లందరూ ఐక్యంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. బీసీ లందరూ ఐక్యంగా ఉద్యమించాలని జాతీయ మహాసభకు జిల్లా నుంచి పెద్ద ఎత్తున ప్రతినిధులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

## వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు




**కలువాయి, మేజర్‌న్యూస్ :** నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయ భాస్కర్ రెడ్డి జన్మదినం సందర్భంగా సోమవారం సోమశిల దక్షిణ కాలువ 2 చైర్మన్ మల్లు విజయ్‌కుమార్ రెడ్డి.. నారాయణ విద్యాసంస్థల స్కూల్స్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ మల్లు శ్రీనివాసులు రెడ్డి.. సంయుక్తంగా ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. పుట్టినరోజు సందర్భంగా అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. కుల మతాలకు అతీతంగా ఆయనకు వేద ఆశీర్వచనాలు అందజేశారు.

## ఆంధ్రా ప్రీమియం లీగ్‌కు

# ఎంపికైన భార్గవ్ మహేష్



**కావలి, మేజర్‌న్యూస్ :** ఆంధ్ర ప్రీమియం లీగ్ కావలి పట్టణం నుండి భార్గవ్ మహేష్‌ను కాకినాడ కింగ్స్ జట్టులోకి తీసుకున్నారు. గత సంవత్సరం భార్గవ్ అండర్-19 రాష్ట్రస్థాయిలో ఆంధ్ర ప్రదేశ్ టీం తరఫున పోటీలో పాల్గొని ఆడారు. ప్రస్తుతం అండర్ 19 జోన్స్‌లో ఆడుతున్నారు. అయితే కావలి కేసీఏ కోచ్ రాజశేఖర్ పర్యవేక్షణలో మహేష్ శిక్షణ తీసుకుంటున్నారని కేసీఏ వ్యవస్థాపకులు సిద్దు తెలిపారు.